# మునెమ్మ

డా.కేశవరెడ్డి



# మునెమ్మ

డా॥ కేశవరెడ్డి

తొలిపలుకు : జయప్రభ

మలిపలుకు : అంబటి సురేంద్రరాజు

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

| | | |
|---|---|---|
| ధర | : | రూ. **40/-** |
| తొలి ముద్రణ | : | చతుర మాసపత్రిక, అక్టోబర్ 2007 |
| HBT తొలి ముద్రణ | : | సెప్టెంబర్ 2008 |
| ముఖచిత్రం | : | కాళ్ళు |
| రచయిత ఫోటో | : | భరత్ భూషణ్ |
| కవర్ డిజైన్ | : | రమణజీవి |
| ప్రతులకు, వివరాలకు | : | హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్ గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 067 ఫోన్ : 23521849 |
| ముద్రణ | : | అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్, హైదరాబాద్ - 28 ఫోన్ : 23391364, 23304194 |




**మునెమ్మ ప్రయాణం**

# ఆధునిక తెలుగు కాల్పనిక సాహిత్యంలో 'మునెమ్మ' ప్రత్యేకత

**నా** సమకాలంలో తెలుగులో నాకు అభిమాన రచయితల్లో ఒకరు డాక్టర్ కేశవరెడ్డి. తెలుగులో మనం గొప్పగా చెప్పుకోవలసిన కొద్దిమంది రచయితల్లో మొదటివరసలో కూర్చోబెట్టవలసినవారు కేశవరెడ్డి గారు. ఆయన ఎన్నుకున్న ఇతివృత్తాలూ....వాటిని ఆయన తనదైన శైలిలో ఉత్కంఠతో కొనసాగించిన తీరూ ఇవన్నీ రచయితగా ఆయన ప్రత్యేకతని స్పష్టంగా చూపిస్తాయి.

చాన్నాళ్ళ కిందట...ఇవాళ్టిలాగా సెల్‌ఫోన్లు లేని కాలంలో....పరస్పర గౌరవాభిమానం కల్గిన మేమిద్దరం ఉత్తరాలలో సంభాషించుకునే రోజుల్లో...ఒకసారి ఆయనతో నేనిలా అన్నాను..."అయ్యా! మీ రచనల్లో స్త్రీ పాత్రలే ఉండవు. ఉన్నా వాటికి ప్రాధాన్యతే ఉండదు. మీ దృష్టిలో స్త్రీలకే ప్రాధాన్యత లేదా? లేక స్త్రీలని ముఖ్యపాత్రగా మలచి కథ రాయగల్గిన శక్తి మీకు లేదా? ఆడవాళ్ళంటే మీకేమన్నా భయమా??" అంటూ కవ్వించేను. అప్పుడు ఆయన నాకు ఎటువంటి జవాబు చెప్పలేదు. కాని నిశ్శబ్దంగానే నా ప్రశ్నలని గురించి ఆత్మవిమర్శ చేసుకున్నట్టున్నారు. నా 'సవాల్'ని స్వీకరించినట్టున్నారు. మొన్నామధ్య ఫోన్‌చేసి, జయప్రభగారూ 'ఆనాడు మీరు అలా ప్రశ్నించారు కదా! మీ ప్రశ్నలకి జవాబుగా మీకు "మునెమ్మ" ని పంపిస్తున్నాను చదవండి' అన్నారు. తన రచనా జీవితంలోనే తొలిసారిగా స్త్రీని ముఖ్యపాత్రని చేసి ఆయన ఒక "మునెమ్మ" ని సృష్టించిన తీరు – నా మనసుని గెలుచుకుంది. మునెమ్మ కథని చదివాకా....నాకు కల్గిన స్పందనలూ....ఆలోచనలూ ఇవీ !!

ఆధునిక కాలంలో తెలుగులో వచ్చిన కాల్పనిక సాహిత్యాన్ని గురించి.... ఆ రచనలపై ప్రసరించిన ప్రభావాల గురించి...వాటి క్రమ వికాసం గురించి ఒక స్పష్టతతో

అటు రచయితలు గాని...ఇటు విమర్శకులు గాని ఏ రకమైన ప్రకటనా...పరిశీలనా ఇతమిత్థంగా చేయలేదు. (యూనివర్శిటీ పరిధిలో తయారయ్యే పి. హెచ్.డి. పట్టాల పరిశోధనలు చెప్పుకోగల్గిన దిశలో ప్రయాణం చేసినవి లేవు గనక... వాటిలో గుర్తుంచుకోవలసినంత ముఖ్యమైన విశ్లేషణలేవీ లేవు). ఈ విషయం నేను ఎందుకు చెబుతున్నానంటే...పడమటిదేశాల కాల్పనిక సాహిత్యానికీ...ఆ దేశాల్లో వచ్చిన వివిధ సామాజిక పరిణామాలకీ...ఉద్యమాలకీ దగ్గిర సంబంధం ఉంది. వాటిని గురించి చాలా విపులమైన...అర్ధవంతమైన చర్చలు చేసారు అక్కడి వాళ్ళు.

మన నేల మీద ఆధునిక సాహితీ ప్రక్రియ...పాశ్చాత్య సాహిత్య ప్రభావంతోనే మొదలైంది. తెలుగులో ప్రధానమైన రచయితలు ఎందరో ముఖ్యమైన ఇంగ్లీషు రచయితల రచనలతో ప్రేరణ పొందినవారే! ఆస్కార్‌వైల్డ్ రచనలు చదువుతూ వుంటే వైల్డ్ వ్యంగ్యాన్నించి గురజాడ అప్పారావుగారు బాగానే ప్రేరణ పొందినట్టుగా అర్ధమౌతుంది. అలాగే మిగతా రచయితల మీద కూడా ఇంగ్లీషు కాల్పనిక సాహిత్య ప్రభావం ప్రత్యక్షంగానో పరోక్షంగానో కొంతమేర ఉంది.

ఈ విషయాన్ని కాసేపు పక్కనపెట్టి పాతకాలంనాటి మన కథని గురించి ఆలోచిస్తే...కథాకథనంలో మనదైన ఒక పద్ధతి ముందునించీ మనకి బలంగా ఉంది. 'పంచతంత్రం'గా ప్రపంచానికి మొదటిసారిగా కథని అందించిన వాళ్ళం మనం. మన కథా సంవిధానానికీ....మన జీవన విధానానికీ...మన తాత్వికతకీ మధ్య ఉన్న సంబంధం బలమైనది. అటువంటిదానిని హఠాత్తుగా పూర్తిగా వదిలిపెట్టేసి...దానిపట్ల ఏమాత్రమూ ఆసక్తి చూపనంతగా..పాశ్చాత్య రచనా శిల్పం వైపు ఆకర్షితులమయ్యాం మనం. అయితే...అది మనకి అరువు సొమ్ము లాగానూ....అనుకరణవిద్యలాగానూ మిగిలిందే తప్ప-నిజంగా పాశ్చాత్య దేశాలలోంచి బయలుదేరిన కథావిధానానికి పోటీగా గాని...ప్రత్యామ్నాయంగా గాని నిలవలేకపోయింది. బహుశా అందువల్లనే ఇప్పటిదాకా మన సాహితీరంగాన...కాఫ్కా లాగా...కామూ లాగా ఒక్క రచయితా పుట్టలేదు. ఆధునిక కథనశిల్పంలో ఆ దేశాలవారు చూపిన నైపుణ్యాన్ని- చెప్పుకో గల్గినంతగా మనం చూపలేకపోయాం. ఆధునిక కథ ఇప్పటికీ పశ్చిమదేశాల వారి సొంత సొత్తే !! ఆధునిక జీవితాన్ని...మన తెలుగు కథ, నవల వారంతబాగా

చిత్రించలేదనే ఒప్పుకోవాలి మనం !

అయితే...పాశ్చాత్యదేశాల్లో ఇటీవల వస్తున్న మార్పులని గమనించి చూసి....ముఖ్యంగా లాటిన్ అమెరికన్ కథకుల రచనలు ఇంగ్లీషులోకి అనువాదం అయిన తరువాత పరిస్థితిని గురించి ఆలోచిద్దాం. గాబ్రియల్ మార్క్వజ్ గారికి నోబుల్ సాహితీ పురస్కారం దొరికాక....పాశ్చాత్యులు అప్పటివరకూ తమ దగ్గర చెలామణీలోఉన్న కథన సంవిధానం కన్నా భిన్నమైన మార్క్వజ్ రచనాశైలిలోని "మార్మికత" కి ఎంతో ఆకర్షితులయ్యారు. మేజిక్ రియలిజంపేరుతో వీటిని గుర్తించి...వారంతా మార్క్వజ్...లోస్లా...లూయిస్ బోర్జ్ వంటి రచయితల రచనలకి బ్రహ్మరథం పట్టారు.

నిస్సందేహంగా మార్క్వజ్‌గారు ప్రతిభాశాలి. ఆయన రచనల్లోని ఊహ... అనితర సాధ్యంగా కన్పిస్తుంది. కథకులైన వారు, కథని అలా కదా అనూహ్యంగా... ఉత్కంఠభరితంగా నడిపించాలీ అని కూడా అన్పిస్తుంది.

అయితే...మార్క్వజ్ లా యథాతథంగా ఆ పద్ధతిలోనే కాకపోయినా – "వాస్తవికతతో నిండిన రచనాశైలి" ఆధునిక కాలంలో మన సాహిత్యరంగాన్ని ఆక్రమించక ముందు – ప్రాచీన భారతీయ రచనా సంవిధానంలోని ప్రత్యేకత అంతా దాదాపుగా ఆ తరహాలోనిది కాదా?? మన ప్రాచీన కథలని వేటినన్నా గమనించి చూడండి. భారత రామాయణాలతో సహా! కథ అన్నది ఎక్కడైనా మొదలవుతుంది.ముందుకీ వెనక్కీ నడుస్తుంది. మనుష్యులే కాదు పశుపక్ష్యాదులూ కథనంలో ముఖ్యపాత్రలవుతాయి. హఠాత్తుగా అనుకోని సంఘటనలూ...అద్భుతాలూ జరిగి...కథ ఊహించని మలుపులు తిరుగుతుంది. ఒక్కోసారి..తరవాత ఏం జరిగేదీ మనకు ముందే తెలిసినా కూడా....కథని ముగించేదాకా మనలోని పఠానాసక్తి ఏమీ తగ్గదు.

జీవిత వాస్తవం...సామాజిక వాస్తవం ఉన్నదున్నట్టే కాకుండా రచయిత కల్పనలోంచి...పాత్రల స్వభావంలోంచి – కలలు....అలౌకిక అంశాలు...హేతువుకి లొంగని నమ్మకాలూ ముఖ్యమై... కథని ముందుకి నడిపిస్తాయి.మాజిక్ రియలిజం తరహా రచనల ప్రత్యేకత కూడా సరిగ్గా ఇలాంటిదే.

1920 దశకంలో జర్మనీలోని చిత్రకళారంగంలో ప్రముఖమైన ఈ ధోరణి 1960

దశకానికల్లా ప్రపంచ సాహిత్యరంగంలోకి కూడా అడుగుపెట్టింది. రియలిజం...ఎక్స్‌ప్రెషనిజం...క్యూబిజం...డాడాయిజం...సర్రియలిజాలపై (ప్రపంచ యుద్ధానంతరం) రియాక్షనరీగా వచ్చిన ఉద్యమం ఇది. ఈ తరహా ధోరణులకి కూడా ఒక మూస తయారైపోయి- ఆధునికత...వాస్తవికత అన్నవి మరీ అరిగిపోయి....పడికట్టు పదాలైపోయి....వాటిలోంచి రచయిత కల్పనాశక్తికి స్థలం చాలనప్పుడు...తద్భిన్నమైన ఒకానొక కొత్త టెక్నిక్‌లోకి మళ్ళటం ఊహాచతురులైన రచయితలకు అనివార్యమయ్యింది. పసివాళ్ళు ప్రపంచాన్ని చూసినప్పుడు కల్గేటంతటి విభ్రమంతో ప్రపంచాన్ని చూడగల్గటమూ...చూపించగల్గటమూ ఈ తరహా సృజనలో రచయితలకు సుసాధ్యమైంది!

రాజకీయ ప్రయోజనం కోసం - బలమైన శక్తి కల్గిన సాహితీప్రక్రియగా లాటిన్ అమెరికన్ రచయితలు మేజిక్ రియలిజం పద్ధతిని వాడుకోగలిగేరు. రాజకీయరంగంలో ఉన్న అణచివేత...దోపిడీలని సూటిగా కాకుండా పరోక్షంగా చెప్పగల్గటంలోని ప్రయోజనం మార్క్వజ్ వంటి రచయితలు సాధించేరు. కొలంబియా లోని ఐదేళ్ళపాటు కొనసాగిన violent civil war ని " The story of a ship wrecked sailor" అన్న కథలో మార్క్వజ్ మార్మికంగా వ్యక్తీకరించటాన్ని గమనిస్తే...కథాకథనంలో- వాస్తవికతకన్నా మార్మికధోరణిలోని బలమెంతటిదో అర్థమవగలదు.

తెలుగు కాల్పనిక సాహిత్యంలో రచనాపరంగా వస్తువు విషయంలోనూ....శైలి విషయంలోనూ ప్రయోగాలు చేసిన రచయితలు కూడా చెప్పుకోగల్గినంతమంది లేరు. అలా ఉన్న కొద్దిమంది రచయితలలో  కూడా మళ్ళీ మనకి కేశవరెడ్డిగారే ముఖ్యంగా చెప్పవలసినవారుగా కన్పిస్తారు. ఆయన సాహితీ ప్రస్థానాన్ని గమనించిన వారెవ్వరైనా ఈ అంశాన్ని స్పష్టంగానే గుర్తుపట్టగలరు కూడా!

తెలుగులో కేశవరెడ్డిగారి “మునెమ్మ” నేను ఇందాకా చెప్పిన  మేజిక్ రియలిజం తరహా లక్షణాలున్న రచన. మునెమ్మ కథలో రహస్యం లేదు. ఉన్న రహస్యమైనా కూడా మునెమ్మకి వచ్చిన కల వలన సూచనప్రాయంగా మనకి ముందే తెలిసిపోతుంది. మునెమ్మ కథని సినబ్బ చెబుతూ వుంటాడు. కథని చెప్పడంలో అతడు ఒక క్రమాన్ని పాటించడు. కథ ముందుకీ వెనక్కీ నడుస్తూ వుంటుంది.

పాత్ర గత సంభాషణలు రాయలసీమ మాండలికపు రెడ్డి కుటుంబాల యాసలోనూ....కథనం మాత్రం శిష్టవ్యావ హారికంలోనూ ఉంటాయి. కథలోని సంఘటనలు జరిగిన మరి పన్నెండేళ్ళకి యువకుడైన సినబ్బ వాటిని పునశ్చరణ చేసుకుంటూ పాఠకులతో పంచుకోవటంలో భాగంగా కథ నడుస్తుంది. మొత్తంగా కథాగమనంలో టెంపో ఎంత బాగా ఉంటుందంటే...ఆసక్తిగా ఉత్కంఠతో...కథని పూర్తిచేసిగాని ఆగలేము.

పురుషుడు మాత్రమే బలమైనవాడు, బుద్ధికుశలుడు. అన్యాయాలని సరిదిద్దగల్గినవాడు, కథని తన ఉనికితో ముందుకి నడిపించగ్గనవాడు, పురుషుడే నాయకుడు..పోరాటయోధుడు...అన్న పాపులర్ దృక్పథం నించి విడివడి... మునెమ్మ లాంటి సాధారణ స్త్రీలోని అసాధారణ శక్తిని బయటకు తీసి కథని నడిపిస్తారు రచయిత.

ముగ్ధగా...లోకం పోకడ పెద్దగా తెలియనిదానిగా కథ మొదట్లో మనకి కన్పించిన మునెమ్మ–జయరాముడు చనిపోయినట్టుగా కలగన్న తరవాత – స్థిర సంకల్పం తోనూ...ధీరచిత్తంతోనూ....బుద్ధి చతురతతోనూ....ఒక కొత్త వ్యక్తిత్వం తోనూ తీక్షణంగా మన ముందు ప్రత్యక్షమవటంతో – మునెమ్మ వెంట వెంటనే కథ కూడా చకచకా మలుపులు తిరుగుతూ నడుస్తుంది. కథని బలమైన... శక్తిమంతుడైన నాయకుడే నడపనవసరంలేదన్న విషయాన్ని తన మునెమ్మ రచన ద్వారా రుజువు చేసి చూపించారు కేశవరెడ్డి.

కథలో మునెమ్మ ఎవరి సహాయమూ తీసుకోకపోవటమూ...ఆత్మ విశ్వాసంతో కదలటమూ ఆచితూచి మాట్లాడటమూ...చివరకి తాను సాధించదలుచుకున్న క్రియని సాధించటమూ మనం గమనించాలి.

మునెమ్మ నవలలో కేశవరెడ్డిగారి ఇదివరకు రచనలలో అంతగా కన్పించని హాస్యధోరణి ఒకటి ప్రత్యేకంగా కన్పిస్తుంది. కథ ఎక్కడా బిగువు సడలకుండా ఆసాంతం మనల్ని చదివిస్తుంది.

అయితే...మునెమ్మ భర్త అయిన జయరాముడిని...తగినంత బలమైన కారణమేదీ లేకుండానే తరుగులోడు (కమీషన్ ఏజెంటు) పశువుల నాటు వైద్యుడి సహాయంతో పూర్వ వైరం కూడా ఏదీ లేకుండా..అప్పటికప్పుడు హత్య చేయటం అన్న విషయం

అంత కన్విన్సింగ్‌గా కన్పించదు. కానీ పాఠకుల కుతూహలం మొత్తం మునెమ్మ మీదనే కేంద్రీకృతమై ఉండటంతో...ఇలాంటి విషయాల మీద వారి దృష్టి మళ్ళే వీలుండదు.

మునెమ్మ కథలో ముఖ్యంగా కన్పించే మరో అంశం పాతివ్రత్యం ! మునెమ్మ పతివ్రత. కులపాలిక. అయితే కథలో బొల్లిగిత్త మీద మునెమ్మకి జయరాముడి మీద ఉన్నంత ఆపేక్షా ఉంటుంది.

కథలో పాతివ్రత్యాన్ని మరీ గ్లోరిఫై చేయకుండా జాగ్రత్తపడ్డట్టుగా కన్పిస్తుంది. కేశవరెడ్డిగారి ధోరణి. అందువలన రాయలసీమలో చెలామణీలో ఉన్న అనేకానేక పేరంటాళ్ళ కథల కోవకి చెందకుండా మునెమ్మ తప్పించుకోగల్గింది.

భర్త చచ్చిపోయాడని తెలిసిన తర్వాత...మునెమ్మ దుఃఖపడి చచ్చిపోదు. భర్త చావుకి ప్రతీకారం తీర్చుకున్న తర్వాత కూడా పతివ్రతలకు మల్లే ప్రాణత్యాగం చెయ్యదు. జీవితాన్ని స్వీకరిస్తుంది. బొల్లిగిత్త సాయంతో బతుకుబండి నడుపుకుందికి సమాయత్తమవుతుంది.

ఈ కథ జరిగినప్పటి కాలం భారతదేశానికి స్వాతంత్ర్యం రానప్పటికన్నా ముందటిది. ఇతివృత్తం ఏకోశానా ఆధునికమైనది కాదు. కథలోని వాతావరణం కూడా ఆనాటి కాలానిదే. చిత్తూరు జిల్లాలోని ఒంటిల్లు గ్రామవాసి అయిన మునెమ్మ పదహారణాల గ్రామీణ పడుచు మాత్రమే.

అయితే...కథకుడైన కేశవరెడ్డి గారికి ఇవాల్టికాలంలోని స్త్రీలు చేస్తూన్న ఆలోచనలూ...వాళ్ళు వేస్తూన్న అడుగులూ తెలుసు. అందువలన ఆయన ఎంతగా అరవైఏళ్ళ వెనకటి కథనే ఎన్నుకున్నా మునెమ్మ పాత్రని చిత్రీకరిస్తున్నప్పుడు అనివార్యంగా ఆయనపై సమకాలీన స్త్రీల ఆలోచనల ప్రభావం పనిచేసినట్టుంది.

అందువల్లనే మునెమ్మ నిర్ణయాల్లో...ప్రవర్తనలో...ఆలోచనల్లో పాతకాలంనాటి స్త్రీల పోకడ మరీ ప్రతిఫలించిలేదు. మునెమ్మని నిశితంగా గమనించి చూడండి. ఆమె తనకాలంలో అమలులో ఉన్న ఏ ఆచారాన్ని గానీ...ఏ నమ్మకాన్ని గానీ ఎక్కడా అనుసరించినట్టుగా కన్పించదు, కథ మొత్తం మీద! ఎలాంటి విపత్కర పరిస్థితిలోనూ ఎక్కడా ఒక్కచోటనైనా దైవ ప్రార్థన చేసినట్టుగా గాని...దేవునికి దండం పెట్టుకున్నట్టుగా గాని...కనీసం మనసులో నైనా ఒక్కసారైనా దేవుని స్మరించుకున్నట్టుగా గాని కన్పించని

మునెమ్మ – ఏ ప్రభావం ఆధారంగా ఆ రకంగా తన వ్యక్తిత్వాన్ని రూపొందించు కున్నదో మరి?! అలా చూసినప్పుడు... మునెమ్మ పూరాగా కేశవరెడ్డి గారి మానసపుత్రికే అని అర్థమైపోతుంది.

కేశవరెడ్డి గారూ! అంత తెలివైన అంత సూక్ష్మగ్రాహియైన...అంత సూటిదనం కల్గిన...అంత సున్నితమైన ...అంత తీక్షణమైన మునెమ్మని అపూర్వంగా మా ముందుంచారు. మీకు నా వందనాలు.

**–జయప్రభ**

***లోహిత***
***నవంబరు 15, 2007***
***లక్ష్మివారం***
***కార్తీక శుద్ధ పంచమి.***

# మునెమ్మ

## 1

**ము**నెమ్మ చాల ఆశ్చర్యపోయింది. జయరాముడికి బొల్లిగిత్తమీద అంతకోపం ఎందుకొచ్చింది? అతడుదాన్ని ఎంతగాబాదాడని! దానిమీద తన భర్తకు అంతకోపం ఎందుకొచ్చిందో మునెమ్మ  చెప్పలేకపోయింది.

"ఏవయిందో ఏమో, ఇద్దరం వంక గెడ్డన గడ్డి చెక్కుతూ ఉంటిమి ఎండుగడ్డి. ఏమి పూనిందో ఏమోరా సిసబ్బా! చేతిలో ఉండే పారను ఆడ పారేసి నడుమెత్తి నిల్చున్నాడు. ఇంతింత గుడ్లు పెట్టుకుని కాసేపు నన్నూ, కాసేపు ఆ గిత్తనూ చూసినాడు. నేరుగ పోయిదాని వీపు మీదుండే పగ్గం పట్టుకుని ఈడ్చుకపోయి దాన్ని ఊడగ చెట్టుకు కట్టేసినాడు. పార చేతిలోకి తీసుకుని దాన్నిజవిరే దానికి మొదలు పెట్టినాడు" అంది మునెమ్మ నాతో.

దెబ్బలకు తాళలేక బొల్లిగిత్త నాలుక బయటపెట్టి అరుస్తుంటే దిక్కులు ఓ కొట్టి పోయినాయి. పగ్గం తెంచుకునేదానికి ఎంత ప్రయత్నించినా దానిగుండా కాలేదు. అదేమి సామాన్యమైన పగ్గమా? తొంభై శాతం వెంట్రుకలు, పదిశాతం కలబందనార కలిపి అతడే పేనిన పగ్గం. ఎత్తిన పార దించకుండా జాముసేపు దానిని బాదాడు. చూస్తూ ఉండగానే దాని కుడి డొక్కమీద, కుడి జబ్బమీద, మెడమీద బొచ్చు ఎగిరిపోయింది. మరి కాసేపటికి దాని శరీరం యావత్తూ కుడివైపున నెత్తురు కమ్మసాగింది. నెత్తురు బొట్లు బొట్లుగా నేలమీద రాలసాగింది.

బొల్లిగిత్త అరుస్తున్న అరుపులకు, దాని శరీరాన్ని తాకుతూ పారచేస్తున్న చప్పుడుకు కబోది పిట్టలు మేలుకున్నాయి. దాపున ఉన్న మద్దిమాను కొమ్మలకు వ్రేలాడుతుండిన ఆ పిట్టలు రెక్కలల్లారుస్తూ గాలిలోకి  లేచాయి. వేలాడిగ ఉన్న ఆ పిట్టలు గాలిలో వలయాలు తిరగసాగాయి. సాయంకాలపు ఎండలో వాటి నల్లటి

రెక్కలు మెరవసాగాయి. అవి అలా ఎగురుతుండగా, వాటి నీడలు అవిరామంగా భూమిపై పాకి, ఆ ప్రాంతాన్నంతా కాసేపు మసక చీకటి ఆవరించింది. ఆ మసక చీకట్లో మునెమ్మ విస విస నడిచి వెళ్ళి భర్తను పక్కకు తోసేసి ఊడగ చెట్టు దగ్గర వంగి దారం విప్పేసింది. అప్పటికి బొల్లిగిత్త కుడివైపున జబ్బమీద, డొక్కమీద మెడమీద కండరాలు వేలాడుతున్నాయి. దారంముడి వీడగానే అది చెంగున అల్లంత దూరాన గెంతి, గ్రామం వైపు తిరిగి పరుగు ప్రారంభించింది.

అప్పటికి జయరాముడికి ఆయాసం ముంచుకొస్తున్నది. నిటారుగా నిలబడలేక అటూ ఇటూ ఊగుతున్నాడు. మునెమ్మ భర్త ముందర నిలబడి "ఎందుకు దాని గోడు పోసుకుంటా ఉండావు. దాన్నట్ట కొట్టేబదులు పార తిరగేసి దాని మెడ నరికెయ్యరాదా" అన్నది.

జయరాముడు పారను విసిరి పారేసి, "ఆపనే చేసుందును. అదింకా కాసేపు నా కండ్ల ముందరే ఉండి ఉంటే ఆ పనే చేసుందును" అన్నాడు.

"అది నీకేవి కాక జేసింది? దాని ఒళ్ళంతా ఒక పక్క నంజర నంజర అయిపోయేదాక కొట్టినావు. ఇంట్లో పుట్టి, ఇంట్లో పెరిగిన గొడ్డు. అంతకాక ఏవి జేసిందది?" అనడిగింది.ఆయాసంతో అతడు సరిగా నిలబడలేక కుడిచేత్తో ఊడగ చెట్టుకొమ్మను పట్టుకుని "ఏవి జేసిందో నీకుతెలపదా? ఏవీ తెలపనట్టు మాట్లాడతా ఉండావుగదనే బెస్టులంజా"అన్నాడు.

"అవరా. యాడన్నా కద్దా? అది చేసిందేంది. నాకుతెలిసిందేంది. ఏవురన్నా వింటే నోటిమీద కొడతారు. చేత్తోగాదు. పొరకతో"

జయరాముడు ఊడగ కొమ్మమీదుండిన చేతిని తీసివేసి భార్య చెంపమీద ఫెడీల్మని కొట్టి, "సవాలేసింది చాలు. అది ఊర్లోకి పోయింది. ఇంటికే సచ్చుంటుంది. నువ్వు గూడ అట్టనే సావు" అనరచాడు.

మునెమ్మ పడబోయి తమాయించుకుని, మెల్లగ నడుస్తూ గడ్డి తట్ట వద్దకు వచ్చింది. వంగి దాన్నెత్తి తలమీద పెట్టుకోబోయింది. జయరాముడు విసురుగా వెళ్ళి తట్టను లాక్కుని, "దీన్నిప్పుడు నువ్వు ఇంటికి తీసుకుపోవాల్సిన పనేమీలేదు. రేపీపాటికి ఆ గొడ్డు నా ఇంట్లో ఉండదు" అని గడ్డితో సహా తట్టను కాలువలోకి గిరవాటు పెట్టి, "నేను కడదోవన్నే పోటుమిట్టకుపోతా. తరుగులోనితో మాట్లాడి

గొడ్డును వానికి అప్పజెప్పేస్తా. వాడు దాన్ని దీసుకుపోయి మద్దిపాలెం పరసలో అమ్మేస్తాడు. నువ్వింక చేతులూపుకుంటూ ఇంటికిపో" అని ఊడగ చెట్టుకొమ్మపైనున్న పైగుడ్డను తీసి భుజాన వేసుకుని కాలువ గట్టుమీద నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

కాలువలో నీటిమట్టం మీద తేలియాడుతూ సాగుతున్న ఎండుగడ్డిని, తట్టను చూస్తూ మునెమ్మ చాలసేపు గట్టుమీద నిలబడింది. ఆ తరువాత మెల్లగ అడుగులేస్తూ ఊరివైపు బయలుదేరింది.

బయలుదేరేముందు ఆమె ఊడగ చెట్టు వద్ద పడివున్న పారను తీసుకోవడానికి నడుము వంచి చేతిని చాచింది. వెంటనే కొనవేళ్ళకు నిప్పు కణిక తగిలినట్టు చరాలున చేతిని వెనక్కు తీసుకుంది . చాలా రోజుల తరువాత మునెమ్మ నాతో మాట్లాడుతూ, "ఆ పారను సూడంగానే నా కండ్ల బూసులు కమ్మినాయిరా సిసబ్బా. అది ఎట్లపడుందని! ఎవురన్నా చస్తే పూడ్చిపెట్టేదానికి గుంత తవ్వి పీనుగు వచ్చేదాక గుంతగెడ్డన పారను పక్క వాటాన పడేస్తాం సూడు అట్ట పడుండాది. నేను అప్పుడే అనుకున్నా – అది ఒకటి రెండు దినాల్లోఎవర్నో ఈ భూమ్మీద నుంచి తీసుకుపోతుందని" అన్నది.

## 2

**ఊ**రివైపు బయలుదేరిన బొల్లిగిత్త చెరువుకట్టమీద వడివడిగా నడుస్తున్నది. చెరువు నీళ్లలో దాని బింబం ప్రతిఫలిస్తున్నది.

అప్పుడు చెరువు నీళ్లలో ఊరివాళ్ళం ఓ పది మందిమి ఈదులాడుతున్నాం. వాళ్ళలో నేనూ ఒకడిని. అప్పుడు నా వయసు ఇరవై ఏండ్లు. మేమంతా రొమ్ములోతు నీళ్ళలో నిలబడి, నోటినిండా నీళ్ళు తీసుకుని తలలు పైకెత్తి, ఆ నీళ్ళను పిచికారీ చేసినట్లు ఆకాశంలోకి చిమ్మితే ఆ నీటి బిందువులపైన సాయంకాలపు సూర్య కిరణాలు పడి ఇంద్రధనస్సులు ఏర్పడుతున్నాయి. దీగువ వీధి సాంబశివుడు మా అందరిలో పెద్దవాడు. వాడి ఛాతిమీద, దవడల మీద కండరాలు దిట్టంగా ఉంటాయి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1318**

* * *

**Read other books of Dr. Kesava Reddy @**

**http://kinige.com/kbrowse.php?via=author&**
**name=Dr.+Kesava+Reddy&id=238**